క్లుప్తంగా

భగవన్నామస్మరణతోనే మోక్షం

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం చేకూరుతుందని ఆధ్యాత్మిక వక్తలు జడ్డు జగ్గారావు, రామశేషు అన్నారు. శుక్రవారం స్థానిక దత్త పీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యంనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఆధ్యాత్మిక జ్ఞాన బోధ సభకు హాజరైన వారు మాట్లాడుతూ భగవంతుడి నామాన్ని నిత్యం స్మరణ చేస్తూ ఉంటే సర్వపాపాలు పోతాయని, దుఃఖాలు దరిచేరవన్నారు. మనిషిని తరింపజేసేది తారకమంత్రమని, ప్రతి ఒక్కరూ భగవంతుడి నామాన్ని జపించాలన్నారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ ఆర్.శ్రీనివాసరావు మాస్టారు, పండిత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగం



ఉంగరాడలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ అధికారులు

రేగిడి: మండలంలోని ఉంగరాడ గ్రామంలో వరి పొలాల్లో శుక్రవారం పంటకోత ప్రయోగం చేపట్టారు. ఎకరానికి 30 నుంచి 32 బస్తాల ధాన్యం సమకూరినట్లు ఏవో జి.మురళీకృష్ణ తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది ధాన్యం దిగుబడి పెరిగిందన్నారు. రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



హోమం చేస్తున్న రుత్విక్కులు

బొబ్బిలి: కావ్యకంఠ వశిష్ఠ మహాముని జయంత్యుత్సవాల్లో భాగంగా మండలంలోని కలువరాయి గ్రామంలో అరుణాచల రమణ గణపతి మహర్షి ఆశ్రమంలో గణపతి హోమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



కందిశ గ్రామంలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు, కాలువ

రేగిడి: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో చాలా చోట్ల పనులు వేగవంతం చేశారు. కందిశ, ఉప్పర్నాయుడువలస, వన్నలి, చాటాయివలస, కోడిశ, చిన్నశిర్లాం తదితర గ్రామాల్లో రూ.60 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణం చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ తెలిపారు.

వరికోతలు ప్రారంభం



కోత పనుల్లో నిమగ్నమైన కూలీలు

రేగిడి: మండల వ్యాప్తంగా వరికోతలు ప్రారంభమయ్యాయి. చేతికందివచ్చిన పంటను కోసి, కళ్లాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది వాతావరణం బాగా అనుకూలించడంతో పంట దిగుబడి కూడా బాగా వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని 39 గ్రామ పంచాయతీల్లో వరికోతలు జరుగుతున్నాయి.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో నిమగ్నమైన విద్యార్థులు

రాజాం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు శుక్రవారం నిర్వహించారు. రాజాంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. రెండు విభాగాల్లో పోటీలు జరిగాయని, గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి వై.అమర్‌నాథ్ తెలిపారు.



వంగర: కె.కొత్తవలసలో పూజలకు సిద్ధమైన భక్తులు



రాజాం సిటీ: కొండంపేటలో నాగులచవితి పూజల్లో కుటుంబ సభ్యులు

నాగుల చవితి సందడి

వాడవాడలా నాగులచవితి సందడి శుక్రవారం కనిపించింది. దీపావళి అమావాస్య తర్వాత వచ్చే కార్తీక శుద్ధ చతుర్థి నాడు చవితి పూజలు నిర్వహిస్తుండడం ఆనవాయితీ. శివభావంతో నాగేంద్రుడిని పూజిస్తే సర్వరోగాలు నశించి, సకల సౌభాగ్యాలు, సంతాన ప్రాప్తి కలుగుతాయన్నది భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఉదయాన్నే తలంటు స్నానమాచరించి, కుటుంబ సభ్యులంతా సంప్రదాయ వస్త్రధారణలో పుట్ట వద్దకు చేరుకుని, నాగదేవునికి పూజలు చేశారు. పాలు, గుడ్లు, చలివిడి పుట్టలో వేసి, ఆశీర్వదించి, కాపాడాలని వేడుకున్నారు. అనంతరం చిన్నాపెద్దా అనే తేడా లేకుండా క్రాకర్స్ కాల్చి, ఆనందంగా గడిపారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం: మెరకముడిదాంలో వైస్ ఎంపీపీ సునీత కుటుంబ సభ్యుల పూజలు



రామభద్రపురంలో పుట్ట వద్ద నాగేంద్రుడికి పూజలు చేస్తున్న భక్తులు



రాజాం సిటీ: క్రాకర్స్ కాల్చుతున్న చిన్నారులు



రేగిడి: వన్నలిలో పుట్ట వద్ద నాగదేవునికి పూజలు చేస్తున్న భక్తులు



రాజాం: పెనుబాకలో పూజలు చేస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు, కుటుంబ సభ్యులు



తెర్లాం: మండల కేంద్రంలో నాగులచవితి పూజలు చేస్తున్న భక్తులు



బొబ్బిలి: పక్కి గ్రామంలో భక్తుల పూజలు



మెంటాడ: పుట్టలో పాలు పోసి, పూజలు చేస్తున్న భక్తులు



బాడంగి: చినభీమవరంలో పూజలు చేస్తున్న భక్తులు

సీఎం జగన్‌తోనే అన్ని వర్గాలకు సమన్యాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించి, తమ జీవితాల్లో వెలుగులు నింపుతున్న సీఎం జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. పద్నాలుగేళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కనీస న్యాయం చేయలేకపోవడంతో పాటు అన్నింటిలోనూ వారిని చిన్నచూపు చూశారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ వల్లే అన్ని సామాజిక వర్గాలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. రాష్ట్ర ప్రజల అభ్యున్నతికి సీఎం జగన్ సేవలు అవసరమన్నారు. రాష్ట్రంలో పెత్తందారులకు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పేదల పక్షాన నిలిచిన సీఎం జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించి, గెలిపించాలని కోరారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 11 గంటలకు బాడంగి, మధ్యాహ్నం 2 గంటలకు రామభద్రపురంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తామని, ఈ సమావేశానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన బొబ్బిలిలో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రపై పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేయనున్నారన్నారు. బస్సు యాత్ర రోజు తొలుత రామభద్రపురంలో మీడియా సమావేశం, బొబ్బిలి మండలంలోని మెట్టవలసలో సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలను ప్రారంభించనున్నామన్నారు. కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణ్‌నాయుడు, మండల సచివాలయ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తవ్వకాలు

బాడంగి: మండలంలోని గొల్లాది గ్రామానికి చెందిన టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు పామోటి సత్యవతి భర్త గోవిందరావు గత నాలుగు నెలలుగా గ్రామానికి సమీపంలోని వేగావతి నది నుంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు చేసి, అమ్మకాలు కొనసాగిస్తున్నట్లు గ్రామస్తులు కొంతమంది శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. రాత్రి వేళల్లో ట్రాక్టర్లలో ఇసుక తరలించి, ఆయన సోదరుడు వెంకటరావు ఇంటి సమీపంలో డంప్ చేసి, విక్రయిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయంపై స్పందించిన తహసీల్దార్ అజురఫీజాన్ దర్యాప్తు చేయమని, సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాజాం సిటీ: స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించనున్నామని మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కంబాల జోగులు హాజరవుతారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం పత్తి కింటాకు రూ.7020కు కొనుగోలు చేయనున్నామన్నారు. సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కు అమ్మకం చేయదలచిన రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలతో ఆర్‌బీకే వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని, యార్డుకు తీసుకురావాలన్నారు. పత్తిలో తేమ 8 శాతానికి మించకుండా ఉండాలని, నాణ్యమైన బాగా ఆరబెట్టిన పత్తిని గోనెసంచితో గానీ, లూజు రూపంలో గానీ తీసుకురావాలన్నారు.

ఘనంగా నందెన్న అనుపోత్సవం

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

రాజాం: మండలంలోని కొత్తపేట గ్రామంలో గౌరీదేవి, పార్వతీపరమేశ్వర సమేత నందెన్న విగ్రహ అనుపోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ విగ్రహ ఊరేగింపు చేపట్టారు. అనంతరం సమీపంలోని నదీ తీరానికి తీసుకువెళ్లి, విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

బాడంగి: మండలంలోని డొంకినవలస, గజరాయునివలస గ్రామాల్లో నందెన్న విగ్రహ అనుపోత్సవం శుక్రవారం నిర్వహించారు. విగ్రహ ఊరేగింపులో భాగంగా చేపట్టిన మహిళల కోలాటం, తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ శివారులోని చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

మెంటాడ: మండల కేంద్రంలో నందెన్న విగ్రహ నిమజ్జనోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన బిందెల డ్యాన్స్, కాంతారా నృత్య ప్రదర్శన, మహిళల కోలాటం ఆద్యంతం అలరించాయి.



బాడంగి: డొంకినవలసలో నిమజ్జనానికి ఎడ్లబండిపై నందెన్న విగ్రహం తరలిస్తున్న దృశ్యం



రాజాం: కొత్తపేటలో నిమజ్జనానికి తరలిస్తున్న నందెన్న విగ్రహం



మెంటాడ: ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కాంతారా నృత్య ప్రదర్శన



మెంటాడ: ఆకట్టుకున్న బిందెల డ్యాన్స్

అతివలకు అండగా దిశ చట్టం



మాట్లాడుతున్న ఎస్పీ దీపికా పాటిల్

- ఎస్పీ ఎం.దీపికా పాటిల్

రామభద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం అతివలకు అండగా దిశ చట్టం తీసుకువచ్చిందని ఎస్పీ ఎం.దీపికా పాటిల్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన ఆమె స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామాల్లో శాంతిభద్రతలపై సచివాలయ మహిళా పోలీసులను అడిగి తెలుసుకున్నారు. ఏపీ దిశ చట్టం ద్వారా మహిళలు ఏ విధంగా రక్షణ పొందవచ్చో వివరించారు. దిశ చట్టంతో కేవలం 21 రోజుల్లోనే శిక్ష అమలు జరుగుతుందన్నారు. పోక్సో కేసు నమోదైన తర్వాత నేరం రుజువైతే ముద్దాయికి 20 ఏళ్ల జైలు శిక్ష పడుతుందన్నారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో చోరీలు జరగకుండా గ్రామస్తులు సైబర్ మోసాల బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాహన తనిఖీలు ముమ్మరం చేసి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జిల్లాలోని ప్రతీ మండలంలో ఐదు వరకు సమస్యాత్మక గ్రామాలు గుర్తించడం జరిగిందని, ఎన్నికల వేళ ఆయా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు 50 మంది దివ్యాంగ విద్యార్థులకు స్వెట్టర్లు, పండ్లు, నోటుపుస్తకాలను ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీధర్, సీఐ తిరుమలరావు, ఎస్‌ఐ సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ‘యాత్ర’ విజయవంతం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అందరి సహకారంతోనే సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమై, మీడియాతో మాట్లాడిన ఆయన రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందనడానికి గురువారం రాజాంలో జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రకు పోటెత్తిన జనమే నిదర్శమన్నారు. స్వచ్ఛందంగా ట్రాక్టర్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో సభకు తరలిరావడం ఆనందకరమైన విషయమన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రాజాం నియోజకవర్గంలో అభివృద్ధి చేశామనడానికి ఈ యాత్ర సక్సెస్ ఓ ఉదాహరణన్నారు. యాత్ర విజయవంతానికి దోహదపడిన రాష్ట్ర మంత్రులు, జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలన్నారు. యాత్రలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రజలకు రవాణా ఇబ్బందులు లేకుండా చేసిన అధికారులను అభినందించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు, రేగిడి వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, సర్పంచ్ వంజరాపు విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- డీఎఫ్‌వో ఎస్.వెంకటేశ్వరరావు



అటవీ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎఫ్‌వో వెంకటేశ్వరరావు

బొబ్బిలి: అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎఫ్‌వో ఎస్. వెంకటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని గోపాలరాయుడిపేటలో అటవీ భూమిని పలువురు ఒడిశా వాసులు ఆక్రమించుకుంటున్నారనే సమాచారం మేరకు శుక్రవారం ఆ ప్రాంతానికి చేరుకున్న ఆయన అక్కడి వన సంరక్షణ సమితి సభ్యులు, అటవీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గోపాలరాయుడిపేటలో 20 హెక్టార్లలో సరుగుడు మొక్కల పెంపకానికి ప్రతిపాదనలు తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అడవుల సంరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట రేంజ్ అధికారి అప్పలరాజు, డిప్యూటీ రేంజ్ అధికారి సుధీర్‌కుమార్, ఎఫ్‌బీవో స్వప్న, వీఎస్ఎస్ సభ్యులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

రూ.1.21 కోట్లతో తాగునీటి సదుపాయం

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామపంచాయతీలో రూ.1.21 కోట్ల వ్యయంతో ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించనున్నామని సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు శుక్రవారం తెలిపారు. గ్రామంలో పైపులైన్, వాటర్ ట్యాంక్ ఏర్పాటు నిమిత్తం రూ.52.80 లక్షలు, మొగిలివలసలో పైపులైన్, వాటర్ ట్యాంక్ ఏర్పాటు కోసం రూ.68.20 లక్షలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇవే కాకుండా జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు కూడా ఇస్తామన్నారు.

గ్రామగ్రామాన ‘వై ఏపీ నీడ్స్ జగన్’

తెర్లాం: మండలంలోని గ్రామగ్రామాన వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం చాలా చురుగ్గా కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్తున్న ప్రజాప్రతినిధులు, వలంటీర్లు నాలుగున్నరేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. శుక్రవారం గంగన్నపాడు గ్రామ సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

గొల్లపల్లిలో అగ్నిప్రమాదం

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని గొల్లపల్లి వీణల కేంద్రం వద్ద శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో బొగాది రమణకు చెందిన మేకలపాక దగ్ధమైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని, మంటలను ఆర్పివేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

తిరుపతిరావుకు సత్కారం

తెర్లాం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో కవి, రచయిత తిరుపతిరావును శుక్రవారం సత్కరించారు. అనంతరం మంచి రచనల ద్వారా సమాజాన్ని మంచి మార్గంలో ఏ విధంగా నడపవచ్చో సన్మాన గ్రహీత తెలిపారు. విద్యార్థులు, యువత సాహిత్యంపై మక్కువ పెంచుకోవాలని, గొప్ప రచయితలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

రాజాం సిటీ: పట్టణంలోని అమ్మవారి కాలనీ ఐదో లైన్‌కు చెందిన పెద్ది హారతి(35) అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. ఈ ఘటనపై సీఐ కె.రవి కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 16వ తేదీ రాత్రి అందరూ నిద్రించే సమయంలో శ్లాబ్ కొక్కెంకు హారతి ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించిన స్థానికులు విశాఖపట్నంలో ఉంటున్న ఆమె అక్క ముద్దన శశికి ఫోన్ చేసి, విషయం తెలియజేశారు. ముంబైలో ఉన్న తన తల్లిదండ్రులు వచ్చేందుకు ఆలస్యం కావడంతో తన చెల్లెలు మృతికి కారణాలు తెలియవని, మృతికి గల కారణాలు తెలుసుకోవాలని మృతురాలి అక్క శశి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.